క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సంబేపల్లె : ఆదర్శ పాఠశాలలో 2025 – 26 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సంబేపల్లె ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ దిలీప్‌కుమార్ తెలిపారు. నేటి నుంచి మార్చి 31 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకొనే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థి అర్హతను పరిశీలించి అర్హుడని తేలితే క్రెడిట్, డెబిట్ నెట్ బ్యాంకింగ్ కార్డులు ఉపయోగించి గేట్‌వే ద్వార రుసుం చెల్లించిన తర్వాత ఒక జర్నల్ నంబర్ పొందాలని తెలియజేశారు. అనంతరం దరఖాస్తు చేసుకున్న వారికి పరీక్షలు నిర్వహించి మెరిట్‌ని బట్టి సీట్లను కేటాయిస్తారని పేర్కొన్నారు.

అటవీ ప్రాంతం పరిశీలన

ఒంటిమిట్ట : కడప – చెన్నై జాతీయ రహదారి నిర్మాణంలో అటవీ ప్రాంతానికి కలిగే నష్టాలపై ఆదివారం నేషనల్ హైవే శాఖ వారి అధికారులు, సిబ్బందితో కలిసి జిల్లా అటవీశాఖ అధికారులు పరిశీలించారు. ఈ పరిశీలన జిల్లా అటవీశాఖ అధికారి వినీత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కడప జేఎంజే కళాశాల వెనుకవైపు ఉన్న అటవీ ప్రాంతం నుంచి మంటపంపల్లి వద్ద ఉన్న సాదకువల్లి దర్గా వరకు నేషనల్ హైవే నిర్మాణం జరిగే అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ జాతీయ రహదారి నిర్మాణం ప్రారంభమై అటవీప్రాంతంలో రోడ్డు పడితే అడవిలో ఉన్న వన్యప్రాణులకు జరిగే నష్టాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో సబ్ డీఎఫ్ఓ స్వామి వివేకానంద, ట్రైనీ ఐఎఫ్ఎస్ శ్రీకాంత్, కడప ఎఫ్ఆర్ఓ ప్రసాద్, ఒంటిమిట్ట ఇన్‌చార్జ్ ఎఫ్ఆర్ఓ బాల సుబ్రమణ్యం, నేషనల్ హైవే అధికారులు, సిబ్బంది, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నరసింహస్వామికి వెండి మకరతోరణం వితరణ

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీలో వెలసివున్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మూలవిరాట్‌కు ఆదివారం కీ.శేలు ఐనమాల నరసింహులు, సుబ్బరత్నమ్మల జ్ఞాపకార్థం వారి మనవడు సునీల్ కుమార్, సౌజన్యలు ప్రత్యేక పూజలు చేసి నరసింహ స్వామికి వెండి మకరతోరణం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో శీనయ్య, సుగుణమ్మ, సుధాకర్, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.


మకరతోరణం అలంకరణలో నారసింహుడు

నల్ల గంగమ్మకు పూజలు


ప్రత్యేక అలంకరణలో నల్లగంగమ్మ

సంబేపల్లె : కోరిన కోర్కెలు తీరుస్తూ భక్తుల కల్పవల్లిగా విరాజిల్లుతున్న శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆదివారం భక్తుల విశేష పూజలు అందుకున్నారు. మండల కేంద్రంలో వెలసిన అమ్మవారిని ఆలయ అర్చకులు విశేష పూజలు జరిపి, ప్రత్యేకంగా అలంకరించారు. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేయించి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారి విగ్రహం ఎదుట ఉన్న బీజాక్షరాలతో ఉన్న రాయికి మొక్కారు. అనంతరం బంధుమిత్రులతో కలసి విందును ఆరగించారు.

లారీ, స్కూటర్ ఢీ
వ్యక్తి పరిస్థితి విషమం

ఓబులవారిపల్లె : మంగంపేట జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం బైక్‌పై వెళ్తున్న పేరూరు శివ అనే వ్యక్తిని లారీ వెనుక నుంచి ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. మంగంపేటలోని ఓ ప్రైవేటు కంపెనీలో శివ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని ఇంటికి బైక్‌పై వెళ్తుండగా మంగంపేట జాతీయ రహదారి గట్టు వద్ద వేగంగా లారీ వెనుక నుంచి ఢీ కొంది. దీంతో శివ కిందపడిపోగా కాలు, చేయి విరిగి తీవ్రంగా రక్తస్రావమైంది. స్థానికులు వెంటనే రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతి ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ పి.మహేష్ నాయుడు తెలిపారు.

ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ట

చిట్వేలి : మైలపల్లి శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం అభిషేకం, పూజలు నిర్వహించి ధ్వజ స్తంభ ప్రతిష్టను పురోహితులు రాయపెద్ది రాజశేఖర్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం గంటలకు వేద పారాయణం చేశారు. భక్తులు ధ్వజ ప్రతిష్టలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.


క్రేన్ సాయంతో ప్రతిష్టిస్తున్న ధ్వజ స్తంభం

రెండవ తలకోన.. మన గుండాలకోన

- నీలకంఠేశ్వరుడిని ప్రతిష్ఠించిన అగస్త్య మహాముని
- మహా శివరాత్రి పూజలకు పెద్దసంఖ్యలో హాజరుకానున్న భక్తులు


గుండాలకోనలో కొలువైన నీలకంఠేశ్వరుడు


భక్తులను పరవశింపజేసే ప్రకృతి అందాలు

ఓబులవారిపల్లె : ఉమ్మడి కడప జిల్లాలోని శైవ క్షేత్రాల్లో ప్రత్యేకతమైంది గుండాల కోన. ప్రకృతి సౌందర్యాల నడుమ ఈ క్షేత్రం ఉండటంతో రెండవ తలకోనగా ప్రసిద్ధి చెందింది. ఓబులవారిపల్లె మండలంలోని వై.కోట గ్రామానికి దక్షిణంగా శేషాచల అటవీ ప్రాంతంలో పదిహేను కిలోమీటర్‌ల దూరంలో కోనల అందాల మధ్య నీలకంఠేశ్వరుడు కొలువైయ్యాడు. అగస్త్య మహాముని కశ్మీర్ నుంచి కన్యకుమారి వరకు స్థాపించిన కోటి లింగాలలో 126వ శివలింగం ఇక్కడ ప్రతిష్ఠించినట్లు చరిత్ర చెబుతోంది. గుండాల కోనకు వెళ్లే మార్గం అటవీ మార్గం కావడంతో ప్రయాణం సుందరమైన దృశ్యాలు, పక్షుల కిలకిలా రావాలు మధ్య సాగుతుంది.

ఆలయ ప్రత్యేకతలు

అగస్త్య మహాముని ప్రతిష్ఠించిన శివలింగానికి మహా శివరాత్రి నాడు నీలకంఠేశ్వరుడుకి విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు జరుగుతాయి. శివరాత్రి పర్వదినాన నీలకఠేంశ్వరుడి దర్శనార్థం జిల్లా నుంచే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఈ క్షేత్రంలో ఆలయానికి పైభాగంలో మొత్తం ఏడు గుండాలు ఉన్నాయి. తిరుమల కొండలపై నుంచి వర్షపు నీరు ఈ గుండాలలో చేరుతాయి. ఇందులో చదును గుండం, గిన్ని, బుడిద, పసుపు, స్నాన, సామారాధన, మాదిగ గుండాలు ఉన్నాయి. ఇక్కడ భక్తులు స్నానాలు అచరించి దైవదర్శనం చేసుకుంటే రోగాలు తొలిగిపోతాయని, సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం. శివరాత్రి సందర్భంగా రాత్రి జాగారం, భజనలు, పూజలు, కథా కాలక్షేపాలు ఆలయ కమిటీ అధ్వర్యంలో నిర్వహించనున్నారు. కొందరు భక్తులు వై.కోట నుంచి 15 కిలోమీటర్లు కాలినడకన ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకుంటారు. భక్తులకు స్వచ్ఛంద సంస్థలు అన్నదాన కేంద్రాలతోపాటు తాగునీరు, మజ్జిగను సేవలందిస్తుంటారు.

ఆర్‌టీసీ ప్రత్యేక బస్సులు

మహాశివరాత్రి సందర్భంగా గుండాల కోనకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆర్‌టీసీ రైల్వేకొడూరు, రాజంపేట నుంచే కాక తదితర ప్రాంతాల నుంచి బస్సు సౌకర్యం కల్పిస్తుంటారు. మహా శివరాత్రి పర్వదినాన ఉదయం ఐదు గంటల నుంచి ఈ ప్రత్యేక బస్సులు మరుసటి రోజు సాయంత్రం వరకు బస్సులను ఆర్టీసీ నడుపుతుంటుంది. భక్తుల రద్దీని బట్టి బస్సుల సంఖ్యను పెంచుతామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. భక్తులు బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలంటూ అధికారులు తెలియజేశారు.

జెడ్‌హెచ్‌డీసీ భూ కబ్జాపై చర్యలు తీసుకోవాలి

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు జెడ్‌హెచ్‌డీసీ భూములకు సంబంధించి ఇష్టారాజ్యంగా కబ్జాలకు పాల్పడి లక్షలాది రూపాయలకు అమ్ముకుంటున్నారని సీపీఐ రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య ఆరోపించారు. చిన్నఓరంపాడు జెడ్‌హెచ్‌డీసీ కొర్లకుంట చెరువు తట్టు భూముల కబ్జాను సీపీఐ నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్‌హెచ్‌డీసీ భూములు దళితులకు ఇవ్వడం జరిగిందని, జాతీయ రహదారి పక్కనే వస్తుండటంతో కబ్జాలకు పాల్పడి పట్టణానికి చెందిన వారికి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. వెంటనే అధికారులు భూములను సర్వే చేయించి నిజమైన పట్టాదారులకు ఇవ్వాలని కోరారు. కొర్లకుంట చెరువు పొరంబోకు భూమిని ఇటీవలే గ్రామానికి చెందిన వ్యక్తి చదును చేసి ఇంటి పనులు ప్రారంభించగా అతనిపై కేసు నమోదు చేసి రెవెన్యూ అధికారులు పెద్ద ఎత్తున హడావిడి చేశారని.. పక్కనే తెలుగుదేశం పార్టీ నాయకులు ఇంటి నిర్మాణం చేపట్టి పూర్తి చేసినా వారిపై ఎటువంటి కేసులు కానీ, రెవెన్యూ పరమైన చర్యలు కానీ తీసుకోలేదని ఆరోపించారు. ఒకరికి ఒక చట్టం, టీడీపీ నాయకులకు మరో చట్టమా అని విమర్శించారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు స్పందించి కొర్లకుంట చెరువు పొరంబోకు భూమిలో కబ్జాలన్నీ తొలగించాలని, లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చింతలపూడి నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

యువతను చంద్రబాబు దగా చేశారు


కూండ్ల ఓబుల్ రెడ్డి

ఒంటిమిట్ట : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలనే కాదు యువతను కూడా మోసం చేశారని రాజంపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు కూండ్ల ఓబుల్ రెడ్డి విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగులను, ఉద్యోగులనే కాదు అన్ని వర్గాల ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు అలవాటుగా మార్చుకున్నారన్నారు. గ్రూప్–2 అభ్యర్థులను నిలువునా మోసం చేశారని, మూడు వారాలుగా గ్రూప్–2 అభ్యర్థుల అభ్యంతరాలను వింటున్నట్టు నటించి చివరకు వారిని నట్టేటా ముంచారన్నారు. తండ్రి ఒక మాట కొడుకు మరో మాట చెబుతూ అభ్యర్థుల జీవితాలతో చెలగాటం ఆడారన్నారు. గ్రూప్–2 వాయిదా వేస్తున్నామంటూ చెప్పి మరోవైపు తమ చేతుల్లో లేదని చెప్పడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. అభ్యర్థుల అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకుంటున్నట్లు విద్యాశాఖ మంత్రి లోకేష్ ఎక్స్‌లో పోస్ట్ చేసినా మరోవైపు తాము వాయిదా వేయమనే చెప్పామంటూ ముఖ్యమంత్రి పేరుతో సర్క్యులేట్ అవుతున్న ఆడియో రాష్ట్ర ప్రజలంతా విన్నారని, ఇంకోవైపు గ్రూప్–2 పరీక్ష వాయిదా అంటూ వార్తలు వేసిన చానెళ్ల మీద కొంతమంది కేసులు పెట్టడాన్ని తప్పుబట్టారు. ఇంతటి గందరగోళం మధ్య పరీక్ష నిర్వహణ ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదన్నారు. న్యాయం చేయాలంటూ ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న అభ్యర్థులను భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి జనవరిలో జాబ్ క్యాలెండర్ అని చెప్పి, అసలు దాని గురించి పట్టించుకోవడం లేదని ఓబుల్ రెడ్డి తెలియజేశారు.

దర్శనీయ క్షేత్రాలు.. మట్లి శివాలయాలు

- మహా శివరాత్రికి అన్ని ఏర్పాట్లు పూర్తి
- విశేష పూజలందుకోనున్న శైవ ప్రతిరూపాలు

మండలం	పురాతన ఆలయాలు	కోనలు
కోడూరు	2	-
ఓబులవారిపల్లి	2	2
పుల్లంపేట	3	-
పెనగలూరు	4	-
చిట్వేలి	3	2


కోడూరులోని శ్రీభుజంగేశ్వరస్వామి ఆలయం

రైల్వేకోడూరు అర్బన్ : శైవ క్షేత్రాలకు పెట్టింది పేరు రైల్వేకోడూరు నియోజకవర్గం. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో శివాలయాలు ఉండటం మరో విశేషం. ఆయా మండలాల్లోని పురాతన ఆలయాలు, కోనలు అలనాటి కాలంలో మట్లి రాజుల పరిపాలనకు, దైవ భక్తికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఈ ప్రాంతాలలో 14, 16 శతాబ్దంలోనే శివాలయాలు ఉన్నాయి. వీటిని అప్పట్లో ఓబులవారిపల్లె మండలం వై.కోటను కేంద్రంగా చేసుకుని మట్లిరాజు వంశీయులైన రాఘవరాజు, భూపతిరాజు, అనంతరాజు చుట్టుపక్కల ప్రాంతాలను పరిపాలిస్తూ వారు ప్రయాణాలు చేసే సమయంలో ఆయా గ్రామాలలో ఆలయాలు నిర్మించారని చరిత్ర. ముఖ్యంగా కోడూరు మండలంలో మల్లికార్జునస్వామి ఆలయం, భుజంగేశ్వరస్వామి ఆలయాలు అప్పట్లో ఎంతో నైపుణ్యంతో నిర్మించారు. ఓబులవారిపల్లె మండలంలో గుండాలకోన, నీలకంఠేశ్వరుడు ఆలయాలు, పుల్లంపేట మండలంలో పర్వతవర్ధిని శాంతిలింగేశ్వర స్వామి ఆలయం, చిట్వేలి మండలంలో సోమేశ్వర స్వామి ఆలయం, పెనగలూరు మండలంలో నాగమల్లేశ్వరస్వామి, కామాక్షి మూలస్థానేశ్వరుడు శివాలయాలు నిర్మించారు. పురాతనమైన శివాలయాల్లో నేటికి భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేయిస్తుంటారు.

ముస్తాబైన శివాలయాలు

మహాశివరాత్రి, కార్తీకమాసం, మాఘమాసంలలో వేలాది మంది భక్తులతో మట్లి రాజులు నిర్మించిన శివాలయాల్లో విశేష పూజులు జరుగుతాయి. భక్తుల రద్దీని పురస్కరించుకుని ఆయా ఆలయాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 26 గురువారం మహాశివరాత్రి సందర్భంగా ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.


మహాశివరాత్రికి సిద్ధమవుతున్న రాఘవరాజపురంలోని శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం

బాసూ.. కాస్త ఆలోచించరాదు!

- ప్రమాదాలు జరుగుతున్న పట్టని వైనం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వాహనచోదకులు


పట్టణంలోని మెయిన్‌రోడ్డులో బస్సును ఆనుకొని వాహనాలను నడుపుతున్న దృశ్యం

రాజంపేట టౌన్ : వాహనదారులు ప్రమాదాల బారీన పడకుండా ఉండేందుకు అధికారులు వివిధ రూపాల్లో సూచనలు చేస్తూనే ఉన్నారు. అయితే అనేక మంది ఆ సూచనలను పాటించకపోవడం వల్ల ప్రమాదాల బారీన పడి ఒక్కోసారి మృత్యువాత కూడా పడుతున్న సంఘటనలు తరచూ జరుగుతూనేవున్నాయి. అయినప్పటికీ వాహనదారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. అందుకు ఈ చిత్రంలో కనిపిస్తున్న దృశ్యమే సాక్ష్యం. రాజంపేట పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో వాహనాలు నిలిచిపోయాయి. అయితే ఓ ఆర్టీసీ బస్సుకు వెనుక వైపు కనీసం ఒక అడుగు కూడా గ్యాప్ లేకుండా మోటారు బైక్ వాహనదారుడు తన బండిని నిలిపాడు, ఆ బైక్‌కు వెనుకనే మరికొన్ని వాహనాలను నిలిపారు. అయితే బస్సు వెనక్కి వస్తే పెద్ద ప్రమాదమే జరుగుతుంది. బస్సుకు వెనుక వైపు 50 అడుగులు దూరం పాటించండి అని పెద్ద అక్షరాలతో రాసివున్నా పట్టించుకోకపోవడం వాహనదారుల అవగాహనా రాహిత్యమనే చెప్పాలి.

వేడుకగా విగ్రహ ప్రతిష్ట

సిద్దవటం : మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలో ఉన్న శ్రీ ఉమాదేవి సహిత అష్టోత్తర(108) మహాశివలింగేశ్వర స్వామి ఆలయం జీర్ణోద్ధరణ పూర్వక పునఃప్రతిష్ట, పంచముఖ గణపతి స్వామి, శ్రీ నీలకంఠేశ్వర మరకత లింగేశ్వరస్వామి, ఉమాదేవి అమ్మవారు, సుబ్రమణ్యేశ్వరస్వామి, సూర్యనారాయణ స్వామి ఆలయాల్లో ఆదివారం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరిగిందని వేద పండితులు చైతన్యశర్మ తెలిపారు. ఆలయాల నిర్వాహకులు సోమబాబు ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను జరిపినట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ప్రొద్దుటూరుకు చెందిన పూజ్యశ్రీ క్రిష్ణమాచార్య గురుజీ గారు హాజరైయ్యారు. అంతేగాకుండా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఇష్టంతో చదివి పరీక్షల్లో రాణించాలి

సిద్దవటం : 10వ తరగతి విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టపడి చదివి పది పరీక్షల్లో రాణించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయశాఖ విభాగం ప్రాజెక్టు మేనేజర్ ఎస్.వి. ప్రవీణ్ తెలిపారు. సిద్దవటం మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతీపురంలోని ఎస్.పి.బి.వి.డి. సభా హైస్కూల్(ఎయిడెడ్)లో ఆదివారం 10వ తరగతి వీడ్కోలు సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రకృతి వ్యవసాయశాఖ విభాగం ప్రాజెక్టు మేనేజర్ ఎస్.వి. ప్రవీణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది పబ్లిక్ పరీక్షలు హాజరవుతున్న విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు పెన్నులను అందజేశారు. 10వ తరగతిలో గత సంవత్సరంలో 552 మార్కులు సాధించిన డి.రేణుక అనే విద్యార్థినికి, 516 మార్కులు సాధించిన ఆర్. సునిత్‌కుమార్‌కు పాఠశాల అధ్యక్షుడు ఎం.డి.ప్రసాద్ ఒక్కొక్కరికి రూ. 15వేలు నగదును అందజేశారు. అలాగే పాఠశాల పూర్వపు విద్యార్థి, సైన్స్ ఉపాధ్యాయుడు ఎం.ఎల్.వెంకటసుబ్బయ్య విద్యార్థిని రేణుకకు రూ. 3116 నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థి తిరువీదుల పెంచలయ్య, వాడిశా మస్తాన్, పాఠశాల హెచ్ఎం మధుసూదన్, పార్వతీపురం బీసీ బాలుర వసతి గృహం వార్డెన్ రాజునాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అధికారి ఎస్.వి.ప్రవీణ్

'అనాథలైన పిల్లలకు ఆర్థికసాయం అందించండి'

రాయచోటి అర్బన్ : తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలకు మానవత సంస్థ తనవంతు సాయం అందించింది. కరోనా సమయంలో తల్లి రాజేశ్వరమ్మ మృతి చెందగా, ఇటీవల తండ్రి రాయచోటి మండలం ఎ.పిలవంకపల్లెకు చెందిన కాంట్రాక్టు లెక్చరర్ వెంకటరమణ గుండెపోటుతో మరణించాడు. దీంతో పిల్లలు అనాథలుగా మారారు. దీంతో బాధిత కుటుంబీకులను ఆదుకోవాలంటూ కాంట్రాక్టు లెక్చరర్స్ జెఏసి నేతలు హరిప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో పలురకాలుగా ప్రయత్నాలు మొదలెట్టారు. మానవతా సంస్థ సభ్యులను కలసి పరిస్థితిని వివరించారు. స్పందించిన సంస్థ సభ్యులు అనాథలైన పిల్లలకు తమ సంస్థ తరపున రూ. 15,116 లు నగదును అందజేశారు. అలానే వీరబల్లికి చెందిన ఆర్మీ మాజీ ఉద్యోగి శివగంగిరెడ్డి, మరో ఉద్యోగి సుదర్శన్‌లు చెరో రూ.1016లు అందించారు. చిన్నారులను ఆర్థికసాయం అందించేందుకు దాతలు ముందుకు రావాలని కాంట్రాక్టు లెక్చరర్స్ జేఏసీ నేతలు హరిప్రసాద్‌రెడ్డి, నాగేశ్వరనాయక్, శివరామిరెడ్డిలు విజ్ఞప్తి చేశారు.


పిల్లలకు ఆర్థికసహాయం అందజేస్తున్న మానవత సభ్యులు

సీజ్ చేసిన బోరు అక్రమంగా వినియోగం

ఒంటిమిట్ట : మండల పరిధిలోని నరవకాటిపల్లి పంచాయతీలో 2174 సర్వే నెంబరులోని మామిడి తోటలో నిబంధనలకు విరుద్ధంగా వేసిన బోరును ఈనెల 15న వల్టా యాక్ట్ – 2002 ప్రకారం స్థానిక రెవెన్యూ సిబ్బంది సీజ్ చేశారు. అయితే సీజ్ చేసిన బోరును అక్రమంగా ఆదివారం మామిడి తోట రైతులు సీజ్‌ను తీసి బోరు నీటిని పొలానికి వాడుకున్నారు. 2173– 5 సర్వే నెంబరులోని చీనీ, నిమ్మ సాగు చేస్తున్న భూమిలోని బోరుకు 60 మీటర్ల దగ్గరలో మరో బోరు వేయడంతో అధికారులకు పలువురు ఫిర్యాదు చేయడంతో సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా సీజ్ చేసిన బోరును వినియోగించిన వారిపై చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు.


సీజ్ చేసిన బోరును వినియోగించిన రైతు

అనాథ శవానికి అంత్యక్రియలు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని మర్రిచెట్టు ఆలయంలో బయట ప్రాంగణంలో ఉంటూ చుట్టుపక్కల వారి సహాయ సహకారాలతో జీవనం సాగిస్తున్న అనాథ వ్యక్తి అనారోగ్య కారణాలతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వారు పాత్రికేయులకు సమాచారం అందించగా ఆ గ్రామ పరిధిలోని పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ వీఆర్‌ఓకు సమాచారం అందించారు. గ్రామ సర్పంచ్ గడ్డం కళ్యాణి ప్రభాకర్ రెడ్డి, వీఆర్‌ఓ పుష్పరాజ్, ఏఎస్ఐ మస్తాన్, వీఆర్‌ఏ సుందరంతోపాటు లక్కిరెడ్డిపల్లి ఉప సర్పంచ్ రాజారెడ్డి, స్థానిక ఉపాధ్యాయుడు రామచంద్రలు అనాథ శవానికి మానవత సంస్థ సహకారంతో అంత్యక్రియలను చేశారు. అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించిన వారిని స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు.


అంత్యక్రియలకు సిద్ధం చేస్తున్న అధికారులు తదితరులు

వైభవం.. వీరభద్రుని బ్రహ్మోత్సవం

రాయచోటిలో కొలువై భక్తుల విశేష పూజలందుకుంటున్న శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం మొదటి రోజు ధ్వజారోహణంతో ఉత్సవాలను వేడుకగా అర్చకులు ఆరంభించారు. స్వామి, అమ్మవార్ల మూల, ఉత్సవ మూర్తులకు విశేష పూజలు జరపడమే కాక గోపూజ, మృత్తిక సంగ్రహణ కార్యక్రమాన్ని ఘనంగా జరిపారు. వీరశైవుల విన్యాసాలు, నృత్యాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని రెట్టింపు చేశాయి.

– రాయచోటి టౌన్


విద్యుత్ దీపాల అలంకరణలో ఆలయ రాజగోపురం


గోపూజ అనంతరం కలశాలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న వేదపండితులు, భక్తులు


గోపూజ చేస్తున్న వేదపండితులు, అధికారులు


మృత్తిక సంగ్రహణ కోసం వెళ్తున్న అర్చకులు, ఆలయ అధికారులు


కంకణధారణ చేస్తున్న వేదపండితుడు